
# గులాబీ గుబాళింపు

- సిట్టింగులకే బీఫారాలు అందజేసిన సీఎం కేసీఆర్
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 11 మందికి పంపిణీ
- అలంపూర్‌లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో చర్చలు
- ఆయా నియోజక వర్గాల్లో కార్యకర్తల సంబురాలు
- 'కారు' జోరును ఢీకొనలేక ప్రతిపక్షాల బెంబేలు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఎన్నికల షెడ్యూల్ ప్రకటించకముందే అభ్యర్థులను ఖరారు చేసి దూకుడు మీద ఉన్న బీఆర్ఎస్.. అన్ని పార్టీల కంటే ముందే ఎన్నికలకు సన్నద్ధమవుతున్న ది. ఆదివారం పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ తెలంగాణ భవన్‌లో అభ్యర్థులకు బీఫారంలు అందజేశారు. గెలుపుగుర్రాలకు బీ ఫారాలు అందించడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆ యా నియోజకవర్గాల్లో కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. స్వీట్లు తినిపించుకొని.. గులాబీ రంగు చల్లుకొని డాన్సులు చేశారు. మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డితోపాటు సిట్టింగ్ ఎమ్మెల్యేలైన చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాజేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, జైపాల్ యాదవ్‌లకు సీఎం కేసీఆర్ బీఫారాలు అందించారు. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వర్గీయులతో చర్చలు జరిపి సమన్వయం చేశాక బీఫారం అందజేయనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అందరూ అనుకున్నట్లే సిట్టింగ్‌లకు టికెట్లు దక్కడంతోపాటు పార్టీ అధినేత బీ ఫారం అందించడంతో పార్టీ నేతలు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించి అసంతృప్తులు వెల్లువెత్తుతున్నాయి. టికెట్ల లొల్లి తారాస్థాయికి చేరింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2018 సీన్ రిపీట్ చేస్తామని బీఆర్ఎస్ కార్యకర్తలు శపథం చేస్తున్నారు. మరోవైపు పార్టీలో వలసల జోరు పెరుగుతున్నది. ఆయా పార్టీల తీరుపై విసుగెత్తి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కూడా కాంగ్రెస్, బీజేపీకి చెందిన నాయకులు 'కారు' ఎక్కుతున్నారు. కారు టాప్ గేరు అందుకోవడంతో ప్రతిపక్షాలకు ముచ్చెమటలు పడుతున్నాయి.




**11 మందికి బీఫారాలు..**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 12 నియోజకవర్గాలకుగానూ 11 మంది అభ్యర్థులకు పార్టీ అధినేత కేసీఆర్ బీ ఫారాలు అందించారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గం నుంచి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, వనపర్తి నుంచి మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, అచ్చంపేట నుంచి విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, మక్తల్ నుంచి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, దేవరకద్ర నుంచి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జడ్చర్ల నుంచి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, నారాయణపేట నుంచి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, గద్వాల నుంచి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కొల్లాపూర్ నుంచి బీరం హర్షవర్ధన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ నుంచి మర్రి జనార్దన్‌రెడ్డి, కల్వకుర్తి నుంచి జైపాల్‌యాదవ్‌లకు బీ ఫారాలు అందించారు. టికెట్లు ఖరారైన అభ్యర్థులు నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ఒక విడుత పర్యటించారు. షెడ్యూల్డ్ వచ్చే వరకే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో గ్రామాల్లో సందడి చేశారు.

**కారు ఎక్కుతున్న క్యాడర్..**

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించడంతో వారు నియోజకవర్గాల్లో విస్తృత స్థాయి పర్యటనలు చేశారు. అభ్యర్థులు తిరుగుతున్నా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఇంకా టికెట్లను ఖరారు చేయకపోవడంతో చాలా మంది కిందిస్థాయి క్యాడర్ తీవ్ర అసంతృప్తిలో ఉన్నది. కాంగ్రెస్ పార్టీలో టికెట్ల వ్యవహారం చిలికిచిలికి గాలి వానలా మారింది. ఎవరికి టికెట్ ఇస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొన్నది. ఇక బీజేపీ నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు జంకే పరిస్థితి వచ్చింది. దీంతో కింది స్థాయి క్యాడర్ విసుగుచెంది గులాబీ కండువా కప్పుకొంటున్నారు. ఇంకా మిగిలిపోయిన సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు గులాబీ తీర్థం పుచ్చుకునేందుకు క్యూ కడుతున్నారు. దీంతో వారిని పార్టీ లో నిలువరించలేక నానా తంటాలు ప డుతున్నారు.ఎమ్మెల్యే అభ్యర్థి ప్రతిరో జూ నియోజకవర్గంలో పర్యటిస్తే కార్యకర్తలు చేరేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. దీంతో అన్ని నియోజకవర్గాల్లో ఎన్నికల నాటికి ప్రతిపక్షాలు ఖాళీ అయ్యే విధంగా కనిపిస్తున్నది.మరోవైపు కాంగ్రెస్ టికెట్లు రాని ఆశావహులు కూడా 'కారు'ఎక్కాలని చూస్తున్నారు.

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంబురాలు..**

బీఆర్ఎస్ అభ్యర్థులకు సీఎం కేసీఆర్ బీ ఫారాలు అందించడంతో ఉమ్మడి జిల్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు చేసుకుంటున్నారు. పటాకులు కాల్చి.. స్వీట్లు పంచుకొని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ శ్రేణుల సంబురాలతో మిన్నంటిపోయాయి. కొన్నిచోట్ల కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి గులాబీ జెండా పట్టుకొని డ్యాన్స్ చేశారు. కేసీఆర్ జిందాబాద్.. కారు గుర్తుకే మన ఓటు అంటూ నినాదాలు చేశారు. సోషల్ మీడియాలో బీ ఫారాలు అందుకున్న అభ్యర్థుల ఫొటోలను షేర్ చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తమ అభ్యర్థులకు భారీ మెజార్టీని కట్టబెడుతామంటూ మూకుమ్మడిగా చెబుతున్నారు.

---

## ప్రజాబలమే.. నాకు బాసట

- **వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి**



వనపర్తి, నమస్తే తెలంగాణ, అక్టోబర్ 15 : ప్రజా బలమే నాకు బాసట అని, వారి ఆశీర్వాదంతోనే మళ్లీ గెలిచి వస్తానని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇంతకాలం ప్రజలిచ్చిన అవకాశంతోనే నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలబెట్టానన్నారు. వనపర్తి భవిష్యత్‌కు సీఎం కేసీఆర్ సహకారంతో గట్టి పునాదులు వేశామని, ప్రజలు మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధితో ముందుకు సాగుతామన్నారు. ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్, మత్స్య, వ్యవసాయ కళాశాలల ఏర్పాటు, రోడ్ల నిర్మాణాలు, నూతన మార్కెట్, టౌన్ హాల్, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలాంటివి పట్టణానికి కొత్త శోభను తెచ్చాయని పేర్కొన్నారు. లక్ష ఎకరాలకు పైగా సాగునీరందించామని, వలసలన్నీ వాపస్ అవుతున్నాయన్నారు. ఐటీ టవర్‌ను వనపర్తికి తలమానికంగా నిర్మాణం చేస్తామని, జరిగిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించి అండగా నిలవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

## పేదల పక్షపాత మ్యానిఫెస్టో



సీఎం కేసీఆర్ రూపొందించిన మ్యానిఫెస్టో పేదలపై ఉన్న ప్రేమను నిరూపిస్తుంది. ఆసరా పింఛన్ల పెంపుదల, పేదల ఆరోగ్యం కోసం బీమా, ఆరోగ్యశ్రీ పరిమితి, రైతుబంధు పెంపు, పేద మహిళలకు జీవన భృతి, మహిళా సమాఖ్యలకు భవనాల నిర్మాణం, రూ.400కు సిలిండర్లు వంటి పథకాలన్నీ ఎంతో మేలు కల్పిస్తాయి. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ వచ్చిన బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టో ప్రజలకు నమ్మకాన్ని కల్పిస్తుంది.

*- మర్రి జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యే*

# మ్యానిఫెస్టో.. సూపర్‌హిట్టు

- బీఆర్ఎస్ ఎన్నికల ప్రణాళిక ప్రకటించిన సీఎం కేసీఆర్
- సంక్షేమానికి, పేదలకు అధిక ప్రాధాన్యత
- 'కేసీఆర్ బీమా.. ప్రతి కుటుంబానికి ధీమా'తో భరోసా

నాగర్‌కర్నూల్/వనపర్తి , అక్టోబర్ 15(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ మ్యానిఫెస్టో.. ప్రతిపక్షాల మైండ్ బ్లాంకయ్యేలా చేసింది. పేదల సంక్షేమం, రోజువారీ జనావసరాల్లో భాగమయ్యేలా రూపొందించిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టో సీఎం కేసీఆర్ ప్రకటించడంతోనే గ్రామస్థాయిలోనూ ప్రజల మదిలోకి చొచ్చుకెళ్లింది. బీఆర్ఎస్ అభ్యర్థులకు తొలివిడతగా బీఫాంలను అందించడంతోపాటుగా వెల్లడించిన ఎన్నికల ప్రణాళికతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణుల్లో హర్షం వ్యక్తం కాగా ప్రజలు సైతం సానుకూలత వ్యక్తం చేస్తున్నారు. పేదలపై సీఎం కేసీఆర్‌కు ఉన్న చిత్తశుద్ధికి ఈ మ్యానిఫెస్టో అద్దంపడుతుందనే అభిప్రాయాలు అన్ని వర్గాల నుంచి వ్యక్తమవుతున్నది.

***పేదల మ్యానిఫెస్టో..***

సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించిన 2023 అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టో ప్రజలను ఎంతగానో ఆకట్టుకొంది. పేదల సంక్షేమమే లక్ష్యంగా రూపొందించడంపై ప్రజలతోపాటుగా మేధావుల్లోనూ చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి పేదరికం దూరం చేసి పేదల ఆర్థిక జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పథకాలను అమలు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ పేదల సంక్షేమానికే ప్రాధాన్యత ఇస్తూ మ్యానిఫెస్టోను ప్రకటించడం విశేషం. ముఖ్యంగా పేదలకు ఆర్థిక భరోసా కల్పించే ఆసరా పింఛన్‌ను రూ.2,016 నుంచి రూ.6,016కు పెంచడం విశేషం. ఈ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే రూ.2,016 ఆసరా పింఛన్ రూ.3,016 కు పెంచడం జరుగుతుంది. ఆ తర్వాత వచ్చే ఐదేండ్లల్లో రూ.5,106కు చేరుకొంటుంది. ఇక దివ్యాంగుల పింఛన్ ఇప్పటికే రూ.4,016కు చేర్చగా రాబోయే ఐదేండ్లలో రూ.6,016కు పెంచనున్నారు. గత సమైక్య పాలనలో రూ.200వరకు మాత్రమే ఉండేది. బీఆర్ఎస్ ఈ పింఛన్లలో గణనీయంగా పెంచింది. ఇక రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ సన్నబియ్యం అందించేలా నిర్ణయించడం గమనార్హం. దీనివల్ల దొడ్డు బియ్యం సమస్య తీరుతుంది. ప్రజలందరూ సన్నబియ్యంతోనే సుష్టుగా భోజనం చేయనున్నారు. అలాగే ఆరోగ్య పరిరక్షణ కోసం రేషన్‌కార్డులున్న పేదలందరికీ ఆరోగ్య ధీమా కింద రూ.5లక్షల జీవిత బీమా కల్పించనున్నారు. అలాగే ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.15లక్షలకు పెంచేలా నిర్ణయించడం విశేషం. ఇక రైతులకు ఇస్తున్న రైతుబంధు పథకం కొనసాగిస్తూనే పెట్టుబడుల సాయాన్ని రూ.10వేల నుంచి అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది రూ.12వేలకు చేర్చుతారు. అనంతరం వచ్చే ఐదేండ్ల నాటికి రూ.16వేలకు పెంచబడుతుంది. ఇలా ఆయా కాలాల్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఇలా పింఛన్లు, రైతుబంధు సాయాన్ని పెంచేలా నిర్ణయించడం ఈ మేనిఫెస్టో ప్రత్యేకత. ఇందులో కొత్తగా చేర్చబడిన పథకం మహిళలకు రూ.3వేల జీవన భృతి కల్పించే సాయం. నిరుపేద మహిళలకు నెలకు రూ.3వేల ఆర్థిక సాయం అందించనున్నారు. అలాగే పేదలకు రూ.400కే సిలిండర్ అందించనున్నారు. దీనివల్ల మహిళలకు, పేదలకు ఆర్థిక కష్టాలు తప్పుతాయి. అదేవిధంగా ఈ పథకాన్ని అక్రిడేషన్ కార్డు కలిగిన జర్నలిస్టులకూ వర్తింపజేయనుండటం విశేషం. కాగా అగ్రవర్ణ పేదలకు నియోజకవర్గానికి ఓ గురుకుల విద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. అలాగే మహిళా సమాఖ్య కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించడం, ఉద్యోగులకు సీపీఎస్ అధ్యయనంపై కమిటీ ఏర్పాటు చేస్తారు. పేదలు, రైతుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణ, జీవన ప్రమాణాల పెంపుదలే లక్ష్యంగా రూపొందించిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై పార్టీ శ్రేణుల్లోనూ, అన్ని వర్గాల ప్రజల్లోనూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



నాగర్‌కర్నూల్‌లో హర్షం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

### ఇదీ బీఆర్ఎస్ మేనిఫెస్టో

- ఆసరా పింఛన్ ఆసరా పింఛన్ రూ.2016నుంచి రూ.5,016కు పెంపు అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలో రూ.3016కు పెంచి రాబోయే ఐదేండ్లలో రూ.5,016కు పెంచడం జరుగుతుంది. వికలాంగుల పింఛన్ రూ.4,016నుంచి రూ.6,016కు పెంపుదల. ఇప్పటికే ఈ పింఛన్‌ను రూ.3,016కు పెంచడం జరిగింది.
- ఆరోగ్య ధీమారాష్ట్రంలోని 93లక్షల కటుంబాలకు కేసీఆర్ భీమా పథకంతో ఆరోగ్య ధీమా కల్పించడం జరుగుతుంది. ప్రతి ఇంటికీ ధీమా పథకం కింద రూ.5లక్షల బీమా
- అన్నపూర్ణ పథకంరాష్ట్రంలోని రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుంది.
- రైతుబంధు రూ.16,000రైతుబంధు పథకం ఎకరానికి రూ.10వేల నుంచి రూ.16వేల వరకు పెంచడం జరుగుతుంది. అధికారంలోకి వచ్చిన మొదటి ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లోనే రూ.12వేలకు పెంచడం జరుగుతుంది. ఆ తర్వాత రాబోయే ఐదేండ్లలో రూ.16వేలకు పెంచబడుతుంది.
- అర్హులైన మహిళలక రూ.3వేల చొప్పున ప్రతి నెలా అందించడం జరుగుతుంది. తద్వారా పేద మహిళల ఆర్థిక భరోసాకు ప్రభుత్వం కట్టుబడుతుంది.
- రూ.400కే సిలిండర్ పేదలకు రూ.400కే సిలిండర్ అందించడం జరుగుతుంది. ప్రత్యేకంగా అక్రిడిటేషన్ కార్డు కలిగిన జర్నలిస్టులకూ ఈ పథకం వర్తింపజేయనుండటం విశేషం.
- ఆరోగ్యశ్రీ గరిష్ఠ పరిమితి రూ.15లక్షలకు పెంపు. ఇప్పటి వరకు రూ.5లక్షలు ఉండగా పేదల కోసం సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ పెంపు చేపట్టారు.
- అగ్రవర్ణ పేదలకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున గురుకులాల ఏర్పాటు
- మహిళా సమాఖ్యలకు సొంత భవనాలు
- ఇంటి స్థలాలు లేని పేదలకు ఇండ్ల స్థలాలు
- ఉద్యోగుల సీపీఎస్‌పై అధ్యయన కమిటీ ఏర్పాటు
- అనాథ పిల్లల కోసం ప్రత్యేక పాలసీ